సాక్షి
జనగామ

ఆదివారం | 3 | నవంబర్ | 2024



ఎండు గంజాయి పట్టివేత

ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి ఎండు గంజాయి తరలిస్తుండగా పోలీసులు కేసముద్రం మండలం ఉప్పరపల్లి రోడ్డు వద్ద పట్టుకున్నారు.

- 8లో▸



క్రీడలతో సర్వతోముఖాభివృద్ధి

విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో తర్ఫీదు పొందడం ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0 / 22^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఫొటో ఎలక్టోరల్ రోల్స్ అబ్జర్వర్‌గా 'ఆయేషా'

జనగామ: జిల్లా ఫొటో ఎలక్టోరల్ రోల్స్ అబ్జర్వర్‌గా ఆయేషా మస్రత్ ఖానమ్‌ను నియమిస్తూ భారత ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయేషా మస్రత్ ప్రస్తుతం పీఆర్, ఆర్‌డీ శాఖ జాయింట్ సెక్రటరీగా పని చేస్తున్నట్లు వివరించారు. భారత ఎన్నికల సంఘం ఫొటో ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.

అలేఖ్యకు రాష్ట్రస్థాయి బహుమతి



లింగాలఘణపురం: చీటూరు ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అలేఖ్య రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్‌లో ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నట్లు హెచ్‌ఎం నర్సింహులు తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన అలేఖ్య ఆదివారం హైదరాబాద్ శిల్పారామం కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ట్రెడిషనల్ స్టోరీ టెలింగ్(సాంప్రదాయ కథల పోటీ) విభాగంలో ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. గైడ్ టీచర్‌గా కల్పన, ఉపాధ్యాయ బృందం అలేఖ్య ప్రతిభను అభినందించారు.

లక్కీడిప్ విజేతలకు బహుమతుల ప్రదానం



జనగామ: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో లక్కీ డిప్ ద్వారా ఎంపికైన లావణ్య(ప్రథమ/జనగామ), గౌతమి(ద్వితీయ/మేడిపల్లి), కార్తీక(తృతీయ/వరంగల్)కు బహుమతులు అందజేసినట్లు జనగామ డిపో మేనేజర్ స్వాతి తెలిపారు. శనివారం బస్టాండ్ ఆవరణలో లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు డిన్నర్ సెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎం.సమ్మయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ వై.యాదమణిరావు, కంట్రోలర్ టీబీఎస్‌రెడ్డి, ఎం.ఉప్పలయ్య, బి.బుచ్చయ్య ఉన్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రతీ 15 రోజులకు ఒకసారి లక్కీడిప్ నిర్వహిస్తామని, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలు స్టేజీ దిగే సమయంలో టికెట్‌పై పేరు, సెల్ నంబర్, అడ్రస్ వివరాలు రాసి డ్రైవర్ వెనకాల ఉన్న లక్కీ డిప్ బాక్స్‌లో వేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

జనగామ: జిల్లాల వారీగా ముందస్తు నిర్దేశించుకున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను వందశాతం ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శని వారం హైదరాబాద్ సచివాలయం నుంచి పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లకు ఆటంకం లేకుండా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచాలని, రైస్ మిల్లర్ల వద్ద తాలు పేరిట కోతలు ఉండకుండా చూడాలని అన్నారు. మిల్లర్లకు సీఎంఆర్ కేటాయింపునకు బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి, గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగో లు చేసిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన ఇంటర్మీడియట్ గోడౌన్లు సిద్ధం చేయాలని అన్నారు. వీసీలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, వేదికపై సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, ఆర్.బాలలక్ష్మి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, షేక్ రిజ్వాన్ బాష



235 వినతులు

బీసీ కమిషన్ బహిరంగ విచారణకు అనూహ్య స్పందన

- హనుమకొండ కలెక్టరేట్‌కు ఉమ్మడి జిల్లానుంచి తరలివచ్చిన బీసీ, కుల సంఘాల నాయకులు
- మాట్లాడే అవకాశం దక్కని వారి నిరసన
- సుదీర్ఘ ప్రసంగంపై కమిషన్ చైర్మన్ నిరంజన్ అసహనం
- 7 గంటలపాటు సాగిన బహిరంగ విచారణ
- 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ముక్తకంఠంతో డిమాండ్



బీసీ కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం ఇస్తున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుందర్ రాజ్ తదితరులు

హన్మకొండ:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు తెలంగాణ వెనుకబడిన తరగతుల (బీసీ) కమిషన్ శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి హనుమకొండలో చేపట్టిన బహిరంగ విచారణకు అనూహ్య స్పందన లభించింది. సుదీర్ఘంగా సాగిన విచారణతో 235 వినతులు వచ్చాయి. హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి బహిరంగ విచారణ చేపట్టారు. ఉదయం 10.52 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం 5.54 గంటలకు ముగిసింది. 7 గంటలపాటు కొనసాగింది. మధ్యలో 25 నిమిషాలపాటు విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం విచారణ ముగించాలని భావించగా అప్పటికే తమ అభిప్రాయాలు వెల్లడించడానికి ఎదురుచూస్తున్న బీసీ సంఘాల నాయకులనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాకు చెందిన ముదిరాజ్ మహాసభ, హనుమకొండ జిల్లాకు చెందిన మేరు సంఘం నాయకులు నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. తమకు అభిప్రాయాలు చెప్పే అవకాశం కల్పించాలని కోరారు. ఈ క్రమంలో కాన్ఫరెన్స్ హాల్‌లో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. తర్వాత కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడే అవకాశం కల్పించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, షేక్ రిజ్వాన్ బాష తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిస్తాం - 8లో▸



రిజర్వేషన్లపై అభిప్రాయం తెలిపేందుకు వచ్చిన వివిధ బీసీ కుల సంఘాల నాయకులు, హాజరైన అధికారులు, హనుమకొండ కలెక్టరేట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

సుదీర్ఘ ప్రసంగాలు.. కమిషన్ ఆగ్రహం, అసహనం..

ఉదయం నుంచి బీసీ, కుల సంఘాల ప్రతినిధులు రాగా జిల్లాల వారీగా వినతిపత్రాలు స్వీకరించి టోకెన్లు జారీ చేశారు. టోకెన్ల వారీగా నాయకులకు మాట్లాడే అవకాశం కల్పించారు. సుదీర్ఘ ప్రసంగం, సంబంధంలేని అంశాలపై మాట్లాడడం పట్ల కమిషన్ చైర్మన్ నిరంజన్ అసహనం వ్యక్తం చేశారు. సూటిగా సమస్య చెప్పాలని కోరినా స్పందించకపోవడంతో ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా వినకపోవడంతో కొన్ని సందర్భాల్లో మైక్ కట్ చేయమని సిబ్బందికి సూచించారు.

- **అల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్** మాట్లాడుతుండగా కమిషన్ చైర్మన్ నిరంజన్ నేరుగా విషయం చెప్పాలని సూచించారు. కాగా, తమను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారని, ఎందుకు అవకాశం ఇవ్వరని నరేందర్ ప్రశ్నించారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటుచేసుకోగా చైర్మన్ నిరంజన్ మైక్ కట్ చేయించి తాము చెప్పింది వినేందుకు వచ్చామని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే కుదరదని చురక అంటించారు. అయినా నరేందర్ తమ ప్రసంగాన్ని కొనసాగించగా, మైక్‌లో మాట్లాడే అవకాశం కల్పించారు.
- **బీసీ సంఘాల ఐక్య వేదిక అనుబంధ విద్యార్థి సంఘం నాయకుడు గొల్లపల్లి వీరస్వామి** మాట్లాడుతుండగా కమిషన్ చైర్మన్ నిరంజన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక వర్గాన్ని వ్యతిరేకించడానికి ఈ విచారణ చేపట్టలేదని, నేరుగా విషయం చెప్పాలని సూచించగా, కొద్దిసేపు వాగ్వాదం జరగగా మైక్ కట్ చేయమని ఆదేశించారు.
- **బీసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్ రావు** ప్రసంగిస్తుండగా సుదీర్ఘంగా వద్దని, సూటిగా సమస్యలు, కావాల్సిన అంశాలు వివరించాలని సూచించారు. అదే పనిగా ప్రసంగం కొనసాగించగా మైక్ తీసుకోవాలా.. ముగిస్తావా అంటూ చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు.

మరికొందరి వివరణలు ఇలా..

- బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు విషయపరంగా మాట్లాడారు. బీసీలకు జరుగుతున్న నష్టం, దక్కాల్సిన వాటిపై సవివరంగా వివరించారు.
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు మాట్లాడిన క్రమంలో చైర్మన్ కలగజేసుకుని కమిషన్ ఆత్మవిశ్వాసంతో ముందుకుపోతోందని, ఒక్కరితో సాధ్యం కాదని బీసీలంతా కలిసి రావాలని, అప్పుడే దేశవ్యాప్తంగా బీసీ కుల గణనను సాధించుకోగలుగుతామన్నారు.
- కుల నిర్మూలన సంఘం ప్రతినిధి రమాదేవి మాట్లాడుతూ కులమతాంతర వివాహాలు చేసుకున్న వారికి నో కాస్ట్, నో రిలీజియన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు.
- లక్కమారి రెడ్డి సంఘం ప్రతినిధి మాట్లాడుతూ తమను 2009లో బీసీ–డీలో కలిపారని, బీసీల నుంచి తొలగించి జనరల్‌లో కలపాలని కోరారు.
- వీరముష్టి కులాన్ని వీరభద్రీయ కులంగా మార్చాలని ఆ కుల సంఘం ప్రతినిధులు, సంచార జాతులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని, గాండ్ల కులస్తులకు గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వడ్డెరలను ఎస్టీలుగా మార్చాలని, ఎంబీసీలోని సంచార జాతులను వేర్వేరుగా గుర్తించి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని, హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై భగీరథుని విగ్రహం ఏర్పాటు చేయాలని, దూదేకులను ముస్లింలుగా గుర్తించాలని, వక్ఫ్‌బోర్డుతోపాటు, రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్ని బీసీ సంఘాల నాయకులు ముక్తకంఠంతో కోరారు.

ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం

బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్




ప్రతీ కులం, బీసీ సంఘాల వారు చెప్పిన అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందిస్తామని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ చెప్పారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలుపై నిర్వహించిన బహిరంగ విచారణ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో జరిగిన ఈ విచారణలో బీసీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఈ బహిరంగ విచారణల ద్వారా బీసీల ఆకాంక్షలు తెలుసుకునే మంచి అవకాశం తమకు లభించిందన్నారు. సమయాభావం వల్ల కొందరికి అవకాశం లభించలేదన్నారు. దీన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఉదయం భద్రకాళి అమ్మవారి దర్శనం చేసుకున్నామన్నారు. ముఖ్యమైన కార్యక్రమం చేపట్టే ముందు అమ్మవారి సన్నిధికి చేరుకుని ఆశీర్వాదం తీసుకున్నామన్నారు. దర్శనం చేసుకున్న అనంతరం తాము చేపట్టిన కార్యక్రమం దిగ్విజయంగా ముగుస్తుందనే విశ్వాసం పెరిగిందన్నారు. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి మాట్లాడుతూ బహిరంగ విచారణలో అనేక అంశాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఈ నెల 6 నుంచి జరిగే సమగ్ర కుల గణనకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద మాట్లాడుతూ ప్రతీ అభిప్రాయాన్ని వీడియో చిత్రీకరణ చేశామన్నారు. బహిరంగ విచారణ ప్రశాంతంగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో ములుగు, జనగామ కలెక్టర్లు దివాకర్, రిజ్వాన్ షేక్ బాషా, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్, హనుమకొండ జిల్లా బీసీ సంక్షేమాధికారి రాంరెడ్డి, జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఆర్‌ఓలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



భద్రకాళి ఆలయంలో..

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని శనివారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ బృందం సందర్శించింది. ఈఓ శేషుభారతి, అర్చకులు ఆలయమర్యాదలతో స్వాగతించారు. బృందం సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.



ఖైదీలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: ఖైదీలకు చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. శనివారం జనగామ సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన జైలులోని వసతులు, భోజనం, ఖైదీల ఆరోగ్య సమస్యలు, అందుతున్న వైద్యం, జైలు సిబ్బందితో ఇబ్బందులేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఏమైనా కంప్లైంట్స్ ఉంటే జైలులో ఏర్పాటు చేసిన బాక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బెయిల్ వచ్చి విడుదల కాని వారి గురించి ఆరా తీశారు. బెయిల్ గ్రాంట్ అయిన ప్రతీ ఒక్కరిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూపరింటెండెంట్ కృష్ణ కాంత్‌కు చెప్పారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

వైద్య సేవల్లో పురోగతి సాధించాలి

- డీఎంహెచ్‌ఓ కె.మల్లికార్జున్ రావు

జనగామ రూరల్: జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు అందించే వైద్య సేవల్లో మరింత పురోగతి సాధించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.మల్లికార్జున్ రావు అన్నారు. జనగామ మండలం ఎల్లంల ఆరోగ్య ఉప కేంద్రంతో పాటు ఎంసీహెచ్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఉప కేంద్రంలో పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, దీనిపై తల్లులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. రికార్డుల మెయింటనెన్స్‌ను తనిఖీ చేసిన ఆయన.. ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని చెప్పారు. అక్కడి నుంచి ఎంసీహెచ్‌కు వెళ్లి కాన్పులు, ఆపరేషన్లపై సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డితో చర్చించారు. డెలివరీ సమయంలో ఆపరేషన్లను తగ్గించడంతో పాటు సాధారణ ప్రసవాలు పెంచేలా చూడాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేసి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండేలా పూర్తి సహకారం అందించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావును కోరారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

కులగణనతో పేదలకు ప్రయోజనం

- ఎంపీలు కిరణ్‌కుమార్‌రెడ్డి, కడియం కావ్య
- సమగ్ర ఇంటింటి సర్వే దశ, దిశానిర్దేశ సమావేశం
- హాజరైన ఎమ్మెల్యేలు శ్రీహరి, యశస్వినిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమారరెడ్డి, వేదికపై ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు శ్రీహరి, యశస్వినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తదితరులు

జనగామ రూరల్: కులగణనతో పేదలకు ప్రయోజనం చేకూరుతుంది.. సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని భువనగిరి, వరంగల్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కడియం కావ్య అన్నారు. శనివారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యాన పట్టణంలోని భ్రమరాంబిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వే జిల్లా స్థాయి దశ, దిశానిర్దేశ సమావేశంలో ఎంపీలతోపాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొన్నారు. ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఒక్కరోజు సర్వే చేసి విషయాలు వెల్లడించకుండా పబ్బం గడిపిందని, తమ ప్రభుత్వం సర్వే జరిగిన వెంటనే వివరాలు వెల్లడించి అందరికీ అన్ని విధాలుగా ప్రభుత్వ పథకాలు అందించనుందని చెప్పారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలన, 10 నెలల కాంగ్రెస్ పాలనకు మధ్య తేడాను గమనించాలని అన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దోచుకుందే తప్ప పేదలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని, కచ్చితంగా ఈ సర్వే పేదలకు ఉపయోగపడుతుందని అన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యంపై ఈ ప్రభుత్వం దృష్టి పెడుతుందని, సర్వేలో సేకరించిన వివరాలతో మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. తెలంగాణ దేశానికి ఒక రోల్ మోడల్ కాబోతున్నదని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన సర్వే వివరాలను ప్రజలకు వెల్లడించాలని కేసీఆర్‌కు సూచించినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ఈ సర్వే ఆర్థికంగా, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన వారు రానున్న రోజుల్లో ముందుకు సాగడానికి దోహదపడుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో ఏఐసీసీ, పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు పని చేయాలని సూచించారు.


ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..

సర్వేకు పార్టీ లోకల్ క్యాడర్ సహకరించాలని, ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సోషల్ మీడియాలో పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, కౌంటర్ ఇవ్వాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ కోసం మేము పని చేస్తామని స్పష్టం చేశారు.

కులగణన జరగాల్సిందే ..

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలంటే కులగణన జరగాల్సిందే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలడుతుందని, సోనియా గాంధీ ఇచ్చిన మాట కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. దమ్మున్న లీడర్ రాహుల్ గాంధీ.. ఆయన ఇచ్చిన మాట కోసం తెలంగాణలో కుల గణనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. అన్ని కులాల్లో ఉన్న పేద వారికి ఉపయోగపడే ఈ సర్వే కోసం వచ్చే అధికారులకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మేడ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్, పీసీసీ సభ్యులు లక్ష్మీనారాయణ నాయక్, చెంచారపు శ్రీనివాస్, వైస్ చైర్మన్ బడికె ఇందిర, మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, అనుబంధ సంఘాల నాయకులు మహేందర్, సుమన్ నాయక్, నారాయణ రెడ్డి, సుంకరి శ్రీనివాస్, దాసరి క్రాంతి, కౌన్సిలర్ జక్కుల అనిత, బోట్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, వేముల సత్యనారాయణరెడ్డి, కంచె రాములు, డాక్టర్ రాజమౌళి, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తరాలను కలుపుతున్న నోములు



నోముల సందర్భంగా కలిసిన ఐదు తరాల కుటుంబసభ్యులు

తరిగొప్పుల: కాలంతో పరిగెడుతూ శుభకార్యాలకు పిలిస్తే రావడానికి కూడా తీరికలేని నేటి కంప్యూటర్ కాలంలో దీపావళి పండుగ నోము ఐదు తరాలను కలిపింది. జీవనోపాధి, ఉద్యోగరీత్యా పలు దేశాలు, పట్టణాల్లో స్థిరపడిన 200 మందికి పైగా కుటుంబ సభ్యులు నోములకు హాజరయ్యారు. మండల పరిధి నర్సాపూర్ గ్రామానికి చెందిన కురుమ కులస్తులు తమ పూర్వీకుల నుంచి కులదైవం శ్రీ మల్లికార్జున స్వామి సన్నిధిలో ప్రతీ దీపావళి పండుగ రోజున కేదారేశ్వర వ్రతం నోచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ కుటుంబానికి సంబంధించి ఐదు తరాలకు చెందిన కుటుంబసభ్యులు వ్రతంలో పాల్గొన్నట్లు గుంటి కనుకయ్య, భీమయ్య, రాజు, సంపత్, బంటి, రవికుమార్, శ్రీను తదితరులు తెలిపారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అవరణంలో మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్ శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కార్తీక దీపోత్సవంలో భక్తులు

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- జీడికల్ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

లింగాలఘణపురం: జీడికల్ వీరాచల రామచంద్ర స్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్‌భాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి బ్రహ్మోత్సవాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీడికల్ జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తారని, జనగామ, యాదగిరిగుట్ట నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే భక్తులకు తగిన వసతులు, తాగునీరు, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, భద్రత, రహదారి మరమ్మతులు, విద్యుత్, వైద్య సేవలు, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. డీపీఓ స్వరూప, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావు, ఆర్డీఓ గోపిరామ్, ఏసీపీ భీమ్‌శర్మ, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, విద్యుత్ అధికారులు వేణుమాధవ్, ఈఓలు వంశీ, రాములు, అర్చకులు భార్గవాచార్యులు, మాజీ చైర్మన్ మూర్తి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కడియం

వినతులు స్వీకరించిన బీసీ కమిషన్..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ అమలుపై శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఉమ్మడి వరంగల్ స్థాయిలో జరిగిన ఈ విచారణలో భాగంగా పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం బీసీ సంఘాల నాయకులు కమిషన్‌కు వినతి పత్రాలు అందజేశారు.






ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను సన్మానిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , కుల సంఘం నాయకుల వినతిపత్రాలు స్వీకరిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్, సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, బస్వరాజు సారయ్య, బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

10న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 10వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–13 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి. కన్నా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు బాలబాలికలకు వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 01, 2011, ఆ తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ వెంట పుట్టినరోజు సర్టిఫికెట్, చెస్‌బోర్డును తీసుకురావాలని సూచించారు ఇందులో గెలుపొందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారుల పేర్ల రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కన్నా తెలిపారు.

మహిళలూ మేల్కోండి..

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు
- పోషకాహారంతోనే వ్యాధులు దూరం
- లేదంటే అనారోగ్య సమస్యలు
- పలువురు వైద్యుల సలహాలు, సూచనలు



హన్మకొండ కల్చరల్ : పిల్లలకు గోరు ముద్దలు పెడతారు. కానీ తాము మాత్రం వేళకు ఆహారం తీసుకోరు.. కుటుంబంలో ఎవరికి సుస్తీ చేసినా తల్లడిల్లిపోతారు. తమ ఆరోగ్యంపై మాత్రం శ్రద్ధ తీసుకోరు. అనేక మంది గృహిణులు సమస్య ఇది. వీరే కాదు విద్యార్థినులు, ఉద్యోగినులు కూడా ఒత్తిడి, బాధ్యతతో తమ ఆరోగ్యంపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. వరంగల్ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలువురు మహిళలు రక్తహీనత, కీళ్ల నొప్పులు, అధిక బరువు, హార్మోన్ల అసమతుల్యత, రోగ నిరోధక శక్తి తక్కువ ఉండడం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఒత్తిడితో చిత్తు ..

వివిధ బాధ్యతలతో విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు ఒత్తిడి ఎక్కువ ఎదుర్కొంటున్నారు. ఎవరితోనూ మాట్లాడకపోవడం.. గుండె దడ.. చిన్న విషయాలకు అతిగా స్పందించడం.. ప్రతికూల ఆలోచనలు ఈ ఒత్తిడి లక్షణాలు. వరంగల్ నగరంలోని మానసిక వైద్యుల వద్దకు 28 శాతం మంది అతి ఆలోచనలు, సమస్యలతో ఆందోళన కారణంగా వస్తున్నావారే ఉన్నారు. పనులను ప్రణాళికాప్రకారం విభజించుకోవడం, రోజుకు కనీసం 45 నిమిషాల వ్యాయామం, ధ్యానం, ఇష్టమైన సంగీతం, ఆరోగ్యకర ఆహారం, పుస్తకపఠనం , అభిరుచులకు పదును పెట్టడం వంటి అంశాలు ఒత్తిడి నుంచి బయటపడేస్తాయి.

అల్పాహారం తినడం లేదు..

చాలా మంది మహిళలు ఉదయం అల్పాహారం తినడం లేదు. తద్వారా గ్యాస్ట్రిక్, హార్మోన్ల అసమతుల్యత, పీసీఓడీ, మధుమేహానికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మానసిక వైద్యుల వద్దకు వస్తున్న మహిళల శాతం 35 ఉందని, అల్పాహారం తినడం లేదని ప్రముఖ వైద్యులు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ సంఖ్య రెట్టింపు ఉంది. 16 నుంచి 30 ఏళ్ల వయసు ఉన్న వారు సరిగా తినకపోవడం వల్ల ఉబకాయం, అండాశయంలో నీటి బుడగలు, థైరాయిడ్ వంటి సమస్యలతో సతమతమవుతున్నారు.

అమ్మో .. రక్తహీనత

16 నుంచి 59 ఏళ్ల మహిళలు 32శాతం రక్తహీనత సమస్యతో ఉన్నారు. వైద్యారోగ్య శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 28 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, ఎండు ఫలాలు, విటమిన్–సి ఉండే నిమ్మ, ఉసిరి, జామ తీసుకోవచ్చు. దానిమ్మ, బీట్‌రూట్, నువ్వు లడ్డూలు, సోయాబీన్, కిస్‌మిస్ వంటి పదార్థాలు ఆర్యోగానికి మేలు చేస్తాయి.

సానుకూల ఆలోచనలను ప్రోత్సహించాలి



మహిళలు ఆందోళనతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ధ్యానం, యోగా సాధన చేయాలి. ఇష్టమైన వ్యాపకం దిశగా వెళ్లాలి. సానుకూల ఆలోచనలు అవసరం. చదువు కోసం కుటుంబానికి దూరంగా ఉండే విద్యార్థునులు, ఉద్యోగాలు కోసం తల్లిదండ్రులను వదిలేసి వెళ్తున్న యువతుల్లో ఒత్తిడి ఎక్కువ కనిపిస్తోంది. నిద్ర, ఆకలి, నిరుత్సాహం, పనిపై ఆసక్తి లేకుండా ఉన్న వారు ఒత్తిడి గురువుతున్నట్లు గుర్తించాలి.

– డాక్టర్ నరేశ్, ప్రభుత్వ వైద్య మండలి రాష్ట్ర సభ్యుడు, ఫోర్ట్‌రోడ్డు వరంగల్

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు సుభిక్షం



మహిళలు మానసికంగా, ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు సుభిక్షంగా ఉంటుంది. సైన్స్ ప్రకారం పురుషుల కంటే మహిళలు ఎక్కువగా మానసిక ఒత్తిడి బారిన పడతారు. పాజిటివ్ ఎమోషన్స్‌ని పునరావృతం చేయాలి..బంధాలను కాపాడుకోవాలి. దైవభక్తి కూడా అవసరం. చాలా మంది మహిళలు ఉదయం అల్పాహారం మానేస్తున్నారు. దీని వల్ల జీవిత కాలం తగ్గే ప్రమాదమూ ఉంది. ఉదయం తినకుంటే మెదడకు రక్త సరఫరా తగ్గిపోతుంది. తలపోటు, మధుమేహం, థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యం వస్తాయి. నీరు తాగడంతోపాటు పండ్ల రసం తీసుకోవాలి. సమయం కుదిరినప్పుడు తినాలి. ఆకుకూరలు, ప్రొటీన్, కాల్షియం, ఎండు ఫలాలు ఆహారంలో భాగం కావాలి. స్వూన్ తేనె తాగడం వల్ల డిప్రెషన్‌ను తగ్గించుకోవచ్చు.

– డాక్టర్ బీఎస్ శరవణభవ, ప్రొఫెసర్, హెడ్ ఫార్మా డీ, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ హనుమకొండ

వసతి గృహాల్లో స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిస్తాం

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హన్మకొండ : రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిస్తామని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు, సౌకర్యాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన తరగతుల వారి ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయడం కోసం కలెక్టరేట్‌లో చేపట్టిన అభిప్రాయ సేకరణలో వసతి గృహాల్లో అందిస్తున్న వసతులపై అనేక మంది అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ హాస్టల్ తనిఖీ చేశామన్నారు. ప్రభుత్వం హాస్టళ్లలో కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కాగా, వసతి గృహంలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లగానే కలెక్టర్ స్పందించి నిర్మించారని వసతి గృహం సంక్షేమాధికారి చెప్పగా చైర్మన్, సభ్యులు.. కలెక్టర్ ప్రావీణ్యను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, ప్రత్యేకాధికారి సతీశ్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రమేశ్ రాథోడ్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి రాంరెడ్డి, వరంగల్ ఆర్డీఓ శ్రీపాల్ రెడ్డి, వసతి గృహ సంక్షేమాధికారి రజిత పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు, కలెక్టర్, అధికారులు

ఎండు గంజాయి పట్టివేత

- ఒడిశాకు చెందిన వ్యక్తి అరెస్ట్

కేసముద్రం: ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి పది కేజీల ఎండు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం.. ఒడిశాలోని గజపతి జిల్లా దుంగస్థల్ గ్రామానికి చెందిన కిషంత్‌నాయక్ రెండు బ్యాగుల్లో పది కేజీల ఎండు గంజాయిని శుక్రవారం నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఒడిశా నుంచి అహ్మదాబాద్ తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో మధ్యలో రైలులో పోలీసులు తనిఖీలు చేపడుతారనే భయంతో మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగాడు. అక్కడి నుంచి వరంగల్ వైపునకు వెళ్లేందుకు ఓ గుర్తుతెలియని వాహనం ఎక్కి కేసముద్రం మండల కేంద్రంలోని ఉప్పరపల్లి రోడ్డు వైపు దిగి మరో వాహనం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులకు అతడిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా రూ.2.50 లక్షల విలువైన పది కేజీల ఎండు గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మురళీధర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుకున్న ఎండుగంజాయిని చూపుతున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రెడ్యాలలో వ్యక్తి, శ్రీమన్నారాయణపురంలో యువకుడు, వెల్దండలో మరో యువకుడు బలవన్మరణాలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.

మహబూబాబాద్ రూరల్ : ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందుతాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిడుగు వెంకన్న (45)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం వెంకన్న రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకొచ్చి అవి చెల్లించే విషయంలో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన రాత్రి గడ్డిమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.



వెంకన్న(ఫైల్)



రాము (ఫైల్)

మనస్తాపంతో యువకుడు..

రఘునాథపల్లి : ఆటో కొనివ్వలేదనే కారణంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని శ్రీమన్నారాయణపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తిప్పారపు శ్రీనివాస్, ప్రేమలత దంపతుల రెండో కుమారుడు రాము (29)కు గతంలో ఆటో కొనివ్వగా ప్రమాదానికి గురయ్యాడు. దీంతో మరోసారి ఆటో కొనివ్వమంటే తండ్రి నిరాకరించాడు. ఈ విషయమై పలుమార్లు తండ్రిని కోరినా స్పందించలేదు. దీనిపై మనస్తాపం చెందిన రాము శనివారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

తండ్రి మందలించాడని మరో యువకుడు..

నర్మెట : తండ్రి మందలించాడనే కారణంతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెల్దండలో జరిగింది. ఎస్సై నైనాల నగేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడమల్ల ప్రవీణ్‌రెడ్డి (27) పౌల్ట్రీ ఫామ్‌లలో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. కొన్ని రోజుల నుంచి పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో తండ్రి ఉప్పల్‌రెడ్డి పని చూసుకోవచ్చు కదా అని మందలించాడు. మనస్తాపం చెందిన ప్రవీణ్‌రెడ్డి శనివారం గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

ఎల్కతుర్తి: పింఛన్ తీసుకోవడానికి వెళ్లిన ఓ వృద్ధురాలు కళ్లు కనిపించకపోవడంతో దారి తెలియక బావిలో పడి మృతి చెందింది. ఈ ఘటన ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన గిన్నారపు అయిలమ్మ (75) అక్టోబర్ 26న పింఛన్ తీసుకోవడానికి వెళ్లింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో 27న ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికారు. కరపత్రాలు పంచి వాకబు చేశారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో తిమ్మాపూర్‌కు చెందిన గూడెం సుమన్ తన బావిలోపడి మృతి చెందిందని ఫోన్ ద్వారా మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. దీంతో వారు వెళ్లి వృద్ధురాలు ధరించిన చీర, జాకెట్ కలర్ చూసి అయిలమ్మగా గుర్తించారు. కళ్లు కనిపించకపోవడంతో దారితప్పి బావిలోపడి మృతి చెందినట్లు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్ కుమార్ శనివారం తెలిపారు.



అయిలమ్మ (ఫైల్)

క్రీడలతో సర్వతోముఖాభివృద్ధి

- కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి
- ఖమ్మంలో కేయూ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో తర్ఫీదు పొందడం ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న కేయూ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం ప్రారంభించారు. ఈ పోటీలకు ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం సాధించి పోటీల్లో పోటీల్లో సత్తా చాటడం ద్వారా వ్యక్తిగతంగానే కాక దేశం ప్రతిష్ట పెరుగుతుందని తెలిపారు. అంతేకాక యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. కాగా, కేయూ పరిధిలో క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించేలా కమిటీలను నియమించి, క్రీడాకారుల ఎంపిక విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి వెంకయ్య మాట్లాడగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, యూసీపీఈ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రవికుమార్, కేయూ పీడీల సంఘం కార్యదర్శి డాక్టర్ బి.వెంకన్నతో పాటు పి.శ్రీనివాస్, కోటి, ఎండీ.గౌస్, షఫీ, శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్, ఏటీబీటీ.ప్రసాద్, జె.ఉపేందర్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

రౌడీ షీటర్‌పై పీడీయాక్ట్

- నిందితుడికి ఉత్తర్వు అందజేత



సంపత్‌కు పీడీయాక్ట్ ఉత్తర్వు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం

ఖిలా వరంగల్: రౌడీషీటర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పీడీయాక్ట్ నమోదు చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, హత్యకు పాల్పడిన కాశిబుగ్గ మధురానగర్ ప్రాంతానికి చెందిన గడ్డం సంపత్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఆ ఉత్తర్వును మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం శనివారం హుజూరాబాద్ సబ్ జైలులో నిందితుడికి అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడు గత సెప్టెంబర్ 13వ తేదీన మరో నిందితుడితో కలిసి మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో ఒకరిని దారుణంగా కొట్టిన ఘటనతోపాటు ఇంతేజార్ గంజ్ పీఎస్ పరిధిలో దోపిడీకి పాల్పడగా పోలీసులు అరెస్ట్ చేసి ఇటీవల హుజూరాబాద్ సబ్ జైలుకు తరలించారు. అలాగే, గతంలో తాడ్వాయి పీఎస్ పరిధిలో హత్యకేసు, మరికొన్ని హత్యాయత్నం కేసుల్లో నిందితుడు జైలుకు వెళ్లినా మార్పు రాకపోవడంతో సీపీ అంబర్ కిషోర్‌ఝా పీడీ యాక్ట్ నమోదు చేశారని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

ఇంటెలిజెన్స్ డీజీపీ పేరుతో ఫోన్..

- రియల్ వ్యాపారికి బెదిరింపు కాల్
- బరితెగించిన సైబర్ నేరగాళ్లు..

జనగామ : సైబర్ నేరగాళ్లు బరితెగించారు. ఏకంగా ఇంటెలిజెన్స్ డీజీపీ పేరుతో ఫోన్ చేసి బెదింపులకు పాల్పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. జనగామకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు తొట్టె కృష్ణకు శనివారం వాట్సాప్ ఆడియో బెదిరింపు ఫేక్ కాల్ వచ్చింది. ఇందులో ఇంటెలిజెన్స్ డీజీపీని మాట్లాడుతున్న.. మీ కొడుకు ఇంజనీరింగ్ చదువుతున్నాడా అంటూ బెదిరించే యత్నం చేశారు. అవతలి నుంచి ఫేక్ వ్యక్తి మాట్లాడుతున్నాడని గమనించిన కృష్ణ.. హిందీ భాషలో కౌంటర్ ఎటాక్ మొదలు పెట్టారు. అయినా సదరు వ్యక్తి బెదిరించేందుకు యత్నం చేసే సమయంలో కృష్ణ కుమారుడు ఫోన్ తీసుకుని ఎదురు ప్రశ్నించడంతో కట్ చేశారు. ఈ సమయంలో కృష్ణ వాట్సాప్‌లో ఫోన్ మాట్లాడే సమయంలో సైబర్ నేరగాడి ఫొటోను(డీపీ) స్క్రీన్ షాట్ తీసుకుని విలేకరులకు చూపించారు. స్థానిక నిఘా వర్గాలకు ఫోన్ చేసి ఈ విషయం తెలిపినట్లు బాధితులు.. విలేకరులకు చెప్పారు.



తొట్టె కృష్ణకు ఫోన్ చేసిన వ్యక్తి ఇతనే..

మహిముదను ఆదుకోండి..

- తండ్రి మరణం..తల్లికి అనారోగ్యం
- ఇంజనీరింగ్ చదువుకు ఆర్థికగండం
- ఇంటి అద్దె కూడా చెల్లించని దుస్థితి
- ఆదుకోవాలని ముఖ్యమంత్రిని వేడుకుంటున్న మహిముద

దీన గాథ

సాక్షి, వరంగల్ : ఓ వైపు పేదరికం..మరోవైపు చదువుకోవాలనే కాంక్ష..కానీ ఆర్థిక పరిస్థితి అనుకూలించడం లేదు. ఫలితంగా నర్సంపేటకు చెందిన మహిముద చదువుకు ఆపదొచ్చింది. చదువులో రాణిస్తూ అధిక మార్కులతో శెభాష్ అనిపించుకున్న మహిముదకు తన తండ్రి మృతితో భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఇన్నాళ్లు తండ్రి ముక్తియార్ పాషా సంపాదించే కొద్దిపాటి జీతంతో హైదరాబాద్‌లో బీటెక్ చదువుకుంటున్న మహిముద ఇప్పుడు తండ్రి మరణంతో ఏకంగా చదువు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. ఇంకోవైపు కడుపు నొప్పితో దీర్ఘకాలంగా బాధపడుతున్న తల్లి ముంతాజ్‌కు సర్జరీ అవసరం కావడంతో మహిముద ఆమెకు సపర్యలు చేయాల్సి వస్తోంది. చదువుకునేందుకు అవసరమయ్యే ఫీజుతో పాటు తల్లి ఆరోగ్యం మెరుగుపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే తన కుటుంబాన్ని నిలబెట్టిన వారవుతారని వేడుకుంటోంది. కుటుంబానికి ఆసరాగా ఉన్న తన తండ్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మృతి చెందడంతో ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయని మహిముద కన్నీరుమున్నీరవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. నర్సంపేటకు చెందిన ముక్తియార్ పాషా, ముంతాజ్‌కు ఇద్దరు కుమార్తెలు మహిముద, మెహరోనిషా. వీరికి స్థానికంగా పెంకుటిల్లు ఉంది. తండ్రి ప్రైవేట్ టీచర్ కావడంతో వచ్చే కొద్దిపాటి సంపాదనలోనే కుటుంబం గడవాల్సిన పరిస్థితి. కాగా, పెంకుటిల్లు సైతం వర్షానికి పూర్తిగా దెబ్బతినడంతో ఏడాదిన్నర నుంచి హనుమకొండలో ఉంటున్నారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన మహిముద.. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతోంది. మరో కుమార్తె మెహరోనిషా హనుమకొండలోని మైనారిటీ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. కాగా, అక్టోబర్‌లో ముక్తియార్ పాషా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మృతి చెందాడు. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబ పరిస్థితి దిగజారిపోయింది. ఇంటికి అద్దె చెల్లించే పరిస్థితి లేదు. అలాగే, తల్లి ముంతాజ్ ఆరోగ్యం క్షీణిస్తుండడం, ఇంకోవైపు మహిముద ఫీజు చెల్లింపుతో ఇబ్బంది ఏర్పడింది. 'మా నాన్న టీచర్. విద్యాబుద్ధులు నేర్పేవారు. ఆ చదువును ఇప్పుడూ నేను ఆపే పరిస్థితి వచ్చింది. ఇంకోవైపు అమ్మ ఆరోగ్యం బాగా లేదు. మా కుటుంబ దీనస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి నేను చదువుకునేందుకు, అమ్మ ఆరోగ్యం నిలిపేందుకు సహకరించాలి' అని మహిముద చేతులెత్తి వేడుకుంటోంది.



మహిముద